

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

సోమవారం,28 ఏప్రిల్ 2025

ఏలూరు జిల్లా
పశ్చిమ
గోదావరి జిల్లా

8 పేజీలు


## నూజివీడు వాసులకు మెరుగైన

# రవాణా సౌకర్యాలు

**- అందుబాటులోకి 19 కొత్త లగ్జరీ బస్సులు - మంత్రి పార్థసారధి చొరవతో తీరిన దశాబ్దాల సమస్య**





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ఒకప్పుడు నూజివీడు నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లాలంటే అక్కడి ప్రజలు ఎంతో శ్రమకోర్చేవారు. ప్రయాణ సమయానికి సరైనవాహనాలు లేకపోవడం, ఆర్టీసీ బస్సులలో ప్రయాణీకుల రద్దీ, తదితర కారణాలతో నూజివీడు నుండి బస్సు ప్రయాణమంటే ప్రజలకు అదో బాధా ప్రయాణం. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నూజివీడుశాసనసభ్యులు, రాష్ట్ర గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నియోజకవర్గంలోని పలుసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.ముఖ్యంగా ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో భాగంగా ఆర్టీసీ బస్సులలో ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణం సాగేందుకు పలు మార్గాలలో బస్సు సర్వీసులు పెంచడమే కాక,ప్రయాణీకులకు 19కొత్త బస్సులను అందుబాటులోనికి తీసుకువచ్చి,ప్రజలకు సుఖవంతమైన ప్రయాణాన్ని సులభతరం చేశారు. మంత్రి పార్థసారథి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంత్రితో మాట్లాడి విజయవాడ మీదగా తిరుమల తిరుపతి వరకు 2 కొత్త సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌లు, ప్రాముఖ్య పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకం వెళ్లేందుకు యర్రగొండపాలెం వరకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్, బెంగుళూరుకు 2 సూపర్ లగ్జరీ బస్ సర్వీసులు,విశాఖపట్నం సూపర్ లగ్జరీ

- తరువాయి 2లో..



**చిన్న వెంకన్న సేవలో**

## మంత్రి కొల్లు రవీంద్ర,

## ఎమ్మెల్యే మద్దిపాటి..

**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:** రాష్ట్ర దేవాలయాల్లో ప్రముఖ దేవాలయం అన్న చిన్న వెంకన్న ఆలయానికి ఆదివారం ఉదయం రాష్ట్ర గనులు శాఖ,ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పీతల సుజాత,ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు పండితులు పూర్ణకుంభ స్వాగతం పలుకుగా ప్రదక్షణల అనంతరంస్వామివారిని పద్మావతి ఆండాళ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలికి శ్రీవారి సేసవత్సాన్ని ప్రసాదాలను సమర్పించారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబురావు స్వామివారి జ్ఞాపికను అందించారు.ఈ క్రమంలో ఆచంట సునీత,మండల

- తరువాయి 2లో..

## అర్హులైన నిరుపేదలందరకి

# ఇళ్ల స్థలాలు

**- ముందు మీరే తీట్టారు కనుక మీరు క్షమాపణ చెప్తే నేను చెప్తాను**
**- ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు**

**కాళ్ళ/ఉండి,మేజర్‌న్యూస్ :** పంట,మురుగు కాలువల రోడ్డు వెంబడి ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమణల తొలగింపులో పేద, ధనిక బేదాభిప్రాయం లేదని డిప్యూటీ స్పీకర్,ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు వెల్లడించారు. పెద అమిరంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రజల అనుమతి,కోర్టు ఉత్తర్వులు అనుసరించి అక్రమణలు తొలగించి ప్రజలకు సురక్షిత అందించాలన్నదే నాలక్ష్యమన్నారు. ఇళ్ల తొలగింపు బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లస్థలాలు కేటాయించామన్నారు. మిగతా బాధితులకు దశల వారీగా ఇళ్ల స్థలాలు కేటాయింపు చేస్తామన్నారు.ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం సరి కాదన్నారు.నాపై అసత్య ఆరోపణలు ముందుగా వారే మాట్లాడారు కాబట్టి ముందు మీరే క్షమాపణ



చెప్తే నేను చెప్తానని పరోక్షంగా సిపిఎం నాయుకులను ఉద్దేశించి రఘురామకృష్ణంరాజు స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా నాపై నిరసనలు వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర

- తరువాయి 2లో..

## పరుగులు పెడుతున్న

# అభివృద్ధి పనులు

**- గత జగన్ ప్రభుత్వంలో నిలిచిన పనులు దశలవారీగా పూర్తి**
**- మంత్రి డా.నిమ్మల రామానాయుడు**





**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** అభివృద్ధి పనులు పరుగులుపెడుతున్నాయని,రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు.ఆయన ఆదివారం ఉదయం నుంచి మండుటెండలో సైతం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత జగన్ పాలనలో నిలిచి పోయిన పనులను మళ్లీగాడిలో పెట్టిపూర్తి చేసేందుకు వారం వారం సమీక్షలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనం,గౌడ శెట్టిబలిజ సామాజిక భవనం, క్రిస్టియన్ స్మశాన వాటిక, ఎన్టీఆర్ కళాక్షేత్రం,చంద్రబాబు నాయుడు ఉద్యానవనం,

- తరువాయి 2లో..

# 'పుట్టగొడుగుల'తో గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి






రంపచోడవరం,మేజర్‌న్యూస్ : పుట్టగొడుగుల పెంపకం చేపట్టడం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో మహిళలు, యువతకు ఉపాధితోపాటు వారు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని హైఫర్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత పేర్కొన్నారు. రంపచోడవరం మండలం ఉసిరిజొన్నల గ్రామంలో కుటీర పరిశ్రమగా గత 10 సంవత్సరాలు నుండి పుట్టగొడుగుల పెంపకం చేపట్టిన సత్యనారాయణ అధ్వర్యంలో నవజీవన్ ఆర్గనైజేషన్, హైఫర్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో 4 మండలాల నుండి సుమారు 25 మంది రైతులకు 3 రోజులపాటు శిక్షణ అందించారు. దీనిలో భాగంగా మొదట వారి గడ్డిని ఏ విధంగా రెడీ చేసుకోవాలి, అదేవిధంగా వాటిని బ్యాగ్‌లలో ఏవిధంగా నింపాలి, ఎటువంటి విత్తనం వాడాలి వంటి ప్రక్రియను ట్రైనర్ సత్యనారాయణ ప్రాక్టికల్‌గా వారితో చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో హైఫర్ ఇంటర్నేషనల్ సంస్థ నుండి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత మాట్లాడుతూ ఎటువంటి విత్తనం ఎంచుకోవాలి, పుట్ట గొడుగులు ఎన్ని రకాలు, వాటికి ఏవిధంగా ఎంత టెంపరేచర్ అందించాలి, డార్క్ రూమ్‌లో ఎన్ని రోజులు ఉంచాలి వంటి టెక్నికల్ విషయాలు తెలియజేశారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికేట్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రోజెక్ట్ కో ఆర్డినేటర్ యస్.శ్రీనివాస్, బి.డి.ఓ ఎం.నాగేశ్వర రావు, డిఈఓ రాంలాల్, సియఫ్‌లు చిన్నలుదొర, సాయి వెంకట్, సత్తిబాబు పాల్గొన్నారు.

## వేట నిషేధ సమయంలో జీవన భృతి పెంచడం పట్ల హర్షం

ఏలూరు,మేజర్ న్యూస్ : మత్స్యకారులకు లక్ష 29వేల 78 మందికి 2 నెలల వేట నిషేధ సమయంలో ఇస్తున్న జీవన భృతి రూ.10వేల నుండి 20 వేల వరకు పెంచి ఇవ్వటాన్ని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ చేపల వేట నిర్వహిస్తూ జీవిస్తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం వేట నిషేధ సమయంలో ఇచ్చే రూ.10వేల నుండి 20వేలకు పెంచడానికి మత్స్యకార కుటుంబాలు చాలా సంతోషంగా జీవిస్తారని ఆదిశేషు తెలిపారు.

## నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

కాకినాడ,మేజర్‌న్యూస్ : మెడికల్ కాలేజీలలో ప్రవేశానికి మే 4వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మే 4వ తేదీన నిర్వహించ నున్న నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) నిర్వహణకు చేపట్టవలసిన ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు సంబంధిత అధికారులు చేపట్టవలసిన అంశాలపై ఉత్తర్వులను జారీ చేశారు.

ఈ ఉత్తర్వులలో డిఆర్ఓ వెంకటరావు మే 4వతేదీ మధ్యాహ్నం 2 నుండి 5 గంటల వరకు నీట్ పరీక్ష జిల్లా కేంద్రం కాకినాడలో 10 పరీక్ష కేంద్రాలలో ఓఎంఆర్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2880 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎంపిక చేసిన 10 సెంటర్లలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆయన కోరారు. అన్ని కేంద్రాలకు కాంపౌండ్ వాల్ తప్పని సరిగా ఉండాని, కేంద్రాలన్నిటిలో సిసి కెమెరాలతో నిశిత పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా పరీక్ష కేంద్రాలన్నిటిలో త్రాగునీరు అందుబాటులో ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

### – ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ.20,000 సాయం విడుదల



రావులపాలెం, మేజర్ న్యూస్ : ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ.20,000 సాయం విడుదల చేసిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రార ంభించారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం జరిగింది. దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మత్స్యకార గ్రామాలకు గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి. వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయం అన్నారు. 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? అని ప్రశ్నించారు. 2014–2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చాము, రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నాము, మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నాము, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నాం అని తెలిపారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి, దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోందన్నారు.

## నూజివీడు వాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలు

మొదటిపేజి తరువాయి

బస్ సర్వీసు, హైదరాబాద్‌కు 11 సూపర్ లగ్జరీ సర్వీసులు, విజయవాడ నాన్ స్టాఫ్ బస్సు సర్వీసులు ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలల్లోనే పరిష్కారం చూపిన మంత్రి పార్థసారథికి నూజివీడు ప్రాంత ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు తమ హర్షాన్ని తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## చిన్న వెంకన్న సేవలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మద్దిపాటి..

మొదటిపేజి తరువాయి

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ, మండల నాయకులు పోలిన శ్రీను, ఇమ్మడి రత్నాజీ, జడ్పీటిసి సభ్యులు చిగురుపల్లిశామ్యూల,మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పాకలపాటి గాంధీ, దేవరపల్లి హేమంత్, నాదెండ్ల సురేంద్ర, యేపూరి దాలయ్య,మొగతడకల శ్రీనివాసరావు,లక్ష్మీ రమణ,మట్టపర్తి రూపేష్ కుమార్,కోట అంజిబాబు, జుత్తిగ శ్రీనివాసరావు,సిఐ విల్సన్, ఎస్సై సుధీర్, సిబ్బంది ఆలయ అధికారులు వున్నారు.

## అర్హులైన నిరుపేదలందరకి ఇళ్ల స్థలాలు

మొదటిపేజి తరువాయి

వ్యాప్తంగా నినాదాలు చేయాలని వ్యంగ్యంగా మాట్లాడారు. ప్రతిరోజు రెండు నుంచి మూడు వాటర్ ప్లాంట్ల ప్రారంభోత్సవాలు జరుగు తున్నాయన్నారు. నియోజకవర్గంలో దాతల సహకారంతో 1000 కెమెరాలు ఏర్పాటు,పెద అమీరంలో ఓపెన్ థియేటర్ కూడా ఏర్పాటుచేస్తున్నామన్నారు. నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధిగురించి ఒక మంచి మాట చెప్పి ఇది తప్పు అంటే సబాబు అన్నారు. ఇటీవల పాలకోడేరు గ్రామంలోకోర్టు ఆదేశాల మేరకు పంటకాలువలో ఉన్న 50 ఇళ్ళ ఆక్రమణలు తొలగించామన్నారు. ఒకసారి స్థలాలు ఇచ్చిన వారు కాకుండా మిగతా వారికి ఇనస్థలాలు కేటాయిస్తామన్నారు. 2.90 లక్షల గ్రాంటు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆకివీడులో ఐభీమవరం రోడ్డులో ఇళ్ళు తొలగించి యుద్ధ ప్రాతిపదికన తాళ్లకోడు ప్రాంతంలో 12మందికి ఇచ్చామన్నారు. ఆకివీడులో మంచినీటి చెరువులో ఉన్న ఆక్రమణలు తొలగించామన్నారు. ఉండి మెయిన్ రోడ్డులో ఉన్న ఆక్రమణ తొలగించామన్నారు. ఉండ్రాడలో 22 గృహాలు తొలగించి వారికి వేరే చోట ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఇటీవల ఆక్వా సమావేశంలో ఆక్వా చెరువు నుంచి పంట కాలువలోకి కలుషిత నీరు వదిలితే ఆ చెరువు లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని చెప్పడం జరిగిందన్నారు. పంచాయతీలు చెత్త చెదారాలను పంటకాలువలోకి వదిలేస్తున్నారు.చెత్త వేస్తున్నట్టు ఫోటో తీసి పంపితే జరిమాను విధిస్తామని ప్రకటించడంతో వంటకాలవల్లో చెత్త వేయడం తగ్గిందన్నారు. పత్రిక విలేకరులు ఇష్టానుసారంగా రాస్తే కేసులు ఎదుర్కొంటున్నారు.సమన్వయం మీకు ఉండాలి.మాకు ఉండాలన్నారు.

## పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు

మొదటిపేజి తరువాయి

అబ్దుల్ కలాం ఉద్యానవనం, కైలాస వనం తదితర అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. కైలాసవనం ప్రాంతంలో అన్నిశాఖలఅధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిం చారు.ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో సుందరవనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనాన్ని నిర్మిస్తే వైసిపి పాలనలో కనీసం రంగులు కూడా నోచుకోలేదన్నారు. అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో పూర్తయిన గృహాలను జగన్ బ్యాంకులో తాకట్టు పెట్టి ఐదు వేల కోట్లను దారి మళ్లించి లబ్ధిదారుల నెత్తిన అప్పు భారం మోపాడు అన్నారు.ఈ ఏడాది వచ్చే జూన్ నాటికి కొందరికి, డిసెంబర్ నాటికి మరికొందరికి గృహాలను అప్పగించేలా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.గత టిడిపి ప్రభుత్వంలో 50 పడకల నుంచి వంద పడకల స్థాయికి పెంచి ఆసుపత్రి భవన నిర్మాణానికి 12.60 కోట్లు నిధులు మంజూరయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెచ్చెట్టి బాబు పాలకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షులు జివి,తదితరులు పాల్గొన్నారు,

# ఆకట్టుకున్న అష్టావధానం



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం 155 వ నెల వారీ సభా కార్యక్రమంలో భాగంగా స్థానిక గీతా మందిరం లో తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావునిర్వహించారు.ఈకార్యక్రమం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది.పూరణ, ధారణ విషయాల్లో అవధాని అత్యంత వేగంగా నిర్వహించటం ఆశ్చర్య చకితులను చేసింది. సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ అధ్యక్షత వహించి అప్రస్తుత ప్రసంగం అంశం కూడా నిర్వహించారు.కవి పండితులు తెన్నేటి లక్ష్మీ నరసింహమూర్తి సంచాలకులుగా వ్యవహరించారు. పృచ్ఛకులు గా గోదావరి ప్రభాకరశాస్త్రి (నిషిద్ధాక్షరి), పంపన సాయిబాబు (దత్త పది), యండపల్లి పాండు రంగాచార్యులు (వర్ణన),దేవరకొండ వెంకట రమణారావు(సమస్య), లంకానాగశశికళ(ఆశువు),కోపల్లె శ్రీనివాస్ (వ్యస్తాక్షరి), డా.పసుపులేటి రామచంద్ర రావు (గీతా వివరణ) వ్యవహరించారు. బిజెపి నాయకులు ఆర్‌విఎస్ రాజు,నరసింహమూర్తి దంపతులు అవధానిని పృచ్ఛకులు సన్మానించారు. సత్కారాలు నెలవారీ కార్యక్రమంలో భాగంగా మదర్ వన్నిని ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు డా వల్లభనేని దుర్గా శ్రీనివాస్ చౌదరికి గౌరవ సత్కారం, కాకినాడకు చెందిన గాయకుడు తిరుక్కోవల్లూరి వెంకటరామన్ కు కళా సత్కారం, పాలకోడేరు ఉన్నత పాఠశాల తెలుగు పండితులు తెన్నేటి లక్ష్మీనరసింహ మూర్తిని ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారంతో సత్కరించారు. పడమర విప్పర్రుకు చెందిన సీనియర్ తబలా కళాకారుడు పసల సూరిబాబుకు ఆర్థిక సత్కారం చేశారు. ఆర్ వి ఎస్ రాజు, తెలుగుదేశం నేత షేక్ బాజీ, పిఎంపి సంఘం నాయకుడు సుంకర కోటేశ్వరరావులు సంఘం తరపున సత్కారాలు నిర్వహించారు. పుస్తకావిష్కరణ తెన్నేటి నరసింహమూర్తి రచించిన బోధామృత శ్రీకృష్ణ గీతపుస్తకాన్ని ఆర్‌విఎస్ రాజు ఆవిష్కరించారు. తెన్నేటి నరసింహమూర్తి, ప్రతిభ దంపతులకు షష్టిపూర్తి సందర్భంగా వేదికపై ఘన సత్కారం నిర్వహించారు. గౌరవఅధ్యక్షుడు కలిసిపూడి మృత్యుంజయరావు, సంఘం ఉపాధ్యక్షులు జెకె కృష్ణ,ఏలూరి జగదీష్, కోశాధికారి మాస బాబురావు, కార్యవర్గ సభ్యుడు సాయిచిరు నాగేశ్వరరావు పలువురు కళాకారులు పాల్గొన్నారు,

## 'ఉండి'లో జరిగిన అభివృద్ధి తెలుసుకొని మాట్లాడాలి



కాళ్ళ,మేజర్‌న్యూస్ : ఉండి నియోజవర్గంలో జరుగుచున్న అభివృద్ధిని వక్ర భాష్యం చెబుతున్న సిపిఎం పార్టీ నిజాలను తెలుసుకొని మాట్లాడాలని ఉండి, ఆకివీడు డిసి చైర్మన్స్ గోకరాజు శివ బాబు,తోట ఫణిబాబు అన్నారు. శివ బాబు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి చేయడంలో రఘురామకృష్ణంరాజు రాజీ పడే వ్యక్తి కాదని వారిపై అసత్య ప్రసారాలు మానుకోవాలని వారు అన్నారు. ఎవరికైనా అనుమానం ఉంటే తమతో వస్తే క్షేత్రస్థాయిలో సమస్యలను వివరించి చెప్తామని వారు తెలియ జేశారు. మొదటి ఎకరాకు ఎలాంటి నీరు అందుతుందో శివారు ఎకరా కూడా అదే నీరు అందించాలనిమురికి కాలువలను,పంట కాలవలను ప్రభుత్వ నిధు లు లేకపోయినా సొంత, దాతల సహకారంతో పనులు చేస్తూ రైతులకు ఇబ్బం ది లేకుండా చేస్తున్నామని వారు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధి చూసి మాట్లాడాలని వారెహితవుపలికారు.ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## ఉప సభాపతి రఘురామరాజు వ్యాఖ్యలకు సిపిఎం నిరసన



నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్ : ఉండి ఎమ్మెల్యే,శాసన సభ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు పేదలపై చేస్తున్న అరాచకాలు ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మణేశ్వరం సెంటర్లో సిపిఎం కార్యకర్తలు ఎమ్మెల్యే వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శిని వ్యక్తిగతంగా దూషించే నైతిక విలువ రఘురామ కృష్ణంరాజుకు లేదన్నారు.ఉన్నత పదవుల్లో ఉన్న ఒక వ్యక్తి మాట్లాడే విధానాన్ని చూస్తే ఆ పదవికి అర్హుడు కాదని పదవికి రాజీనామా చేయాలని రామ్మోహన్ రావు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో కడలి నాగరాజు,బొక్క శ్రీనివాసరావు, కవురు నరసింహస్వామి, కుక్కల శ్రీరామమూర్తి, తిరుమణి సత్య నారాయణ,కౌరు శ్రీనివాస్ గుబ్బల నాగేశ్వరరావు, కే త్రిమూర్తులు, జానుపాముల మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారులకు మహర్దశ
# మత్స్యకార గ్రామాలకు టిడిపి అండగా నిలబడింది



ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కైకలూరు, మేజర్ న్యూస్, కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల కుటుంబాల్లో మహర్దశ వచ్చిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా మత్స్యకారుల జీవనశైలి పరిశీలించి వేట నిషేధ సమయంలో రూ. 20వేల సాయం విడుదల చేశారని కైకలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పేర్కొన్నారు. 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం. మత్స్యకార గ్రామాలకు టీడీపీకి అండగా నిలబడిందన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని,రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచింది. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిందని తెలిపారు.

– చేపల ఎగుమతుల్లో ఏపీ టాప్ –రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉంది. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటుందని ఏపీ నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నాయి. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలి. మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే చేపలు తినాలి అని నరసింహారావు అన్నారు.

## చిన వెంకన్న సన్నిధికి వెలుతున్న ముగ్గురు యువకులను ఢీకొట్టిన లారీ





నల్లజర్ల/ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ : వారంతా ఒకే ప్రాంతానికి చెందిన వారు. ముగ్గురు యువకులు కలిసి తమ మొక్కు తీర్చుకునేందుకు చిన్న తిరుపతి వెంకన్న సన్నిధికి కాలినడకన బయలుదేరి వెళుతున్న సమయంలో నల్లజర్ల పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుండి వచ్చిన కర్ణాటక చెందిన లారీ వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తొలుత వీరిని ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ,అనంతరం రాజమండ్రి ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

## నేడు గుండుగోలను సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

భీమడోలు,మేజర్ న్యూస్ : భీమడోలు సెక్షన్ పరిధిలోని 33/11 కెవి గుండుగోలను సబ్–స్టేషన్ పరిధిలోని ఈ నెల 28వ తేదీ సోమవారం విద్యుత్ లైన్ మరమ్మతులు చేయుటవలన, కొత్త లైన్స్ వేయడం వలన ఈ క్రింది పరిధిలోని ఫీడర్ లకు 11 కెవి గుండుగోలను,ఫీడర్లకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరా నిలిపి వేయబడునని కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. గుండుగోలను గ్రామమునకు సరఫరా అంతరాయం కలుగును. కనుక వినియోగదారులు సహకరించగలరు.

## బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న చైర్ పర్సన్



మొగల్తూరు,మేజర్‌న్యూస్:మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ ఆదివారం ముత్యాలపల్లిలోని బండిముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భముగా ఆలయ అధికారులు మర్యాద పూర్వకముగా స్వాగతం పలికారు.ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. రాష్ట్ర ప్రజలంతా సుకసంతోషలతో ఉండాలని కోరుకున్నారు.

## నేతన్న నేస్తం పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలి

ఏలూరు,మేజర్ న్యూస్ : నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం నిర్ణయించింది. ఆదివారం ఉదయం స్థానిక శనివారపు పేట వీవర్స్ కాలనీలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా చేనేత కార్మికులు ఉపాధి పోయి విధిన పడుతున్నారని అటువంటి కార్మికులను ఆదుకోవాలని మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి నెలకు రూ 2వేలు చొప్పున జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు సమావేశంలో పేరక చిన్న వెంకటేశ్వరరావు ఎర్ర సాంబశివరావు గుత్తి పోతురాజు పగడాల నాగరాజు మాడా వెంకటేశ్వరరావు గుంటూరు సత్యవతి ఎర్ర ఈశ్వరి నార్ని విజయలక్ష్మి ముప్పవల అన్నపూర్ణ గుత్తి దుర్గా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అన్నార్తులకు సంజీవని ముఖ్యమంత్రి సహాయనిధి

**- డా.దాసరి శ్యామ్,సాయిల సత్యనారాయణ**



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** అన్నార్తులకు సంజీవనిగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అన్నారు శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఏడుగురికి రూ.8 లక్షల 35వేల195లు చెక్కులు అందజేసారు. ఈ సందర్భంగా మండలంలోని కేతవరం పంగిడిగూడెం పేరంపేట గ్రామాలకు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి చెక్కులను అందజేసిన టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు,ఆ గ్రామాల స్థానిక తెలుగుదేశం నేతలు ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ 2014 19 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా దాదాపు 1600 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు అందించారని తెలిపారు. తరువాత అధికారములోకి వచ్చినటువంటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీసము ఎక్కడ ఒక చెక్కు కూడా పంపిణీ చేయలేదని, ముఖ్యమంత్రి సహాయ నిధిని అంపసయ్యపైకి ఎక్కించారని తెలిపారు. మరలా 2024లో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారత స్వభావం వలన అర్నార్థులకు అండగా నిలవాలని వారు స్థానిక శాసనసభ్యులు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎవరు రిఫరెన్స్ చేసిన పేదలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందజేస్తున్నారని ఇది పేదలకు సంజీవని అని శేషు తెలిపారు. ఈ సందర్భంగా కేతవరంలోని వరద ఆదిలక్ష్మి కవులూరి సాయి ప్రదీప్ ఇళ్లకు వెళ్లి నేరుగా చెక్కులు వారికి అందించి వారితో మాట్లాడారు స్థానిక శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆదేశాలతో ముఖ్యమంత్రి ద్వారా వచ్చినటువంటి చెక్కులను అందిస్తున్నామని చెప్పారు సాయిల సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యం బాగాలేక వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బంది పడుతున్నటువంటి పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి చేకూర్చడం అత్యంత అభినందించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి శ్రీనివాస్ కేతవరం గ్రామ అధ్యక్షుడు ధర్మేంద్ర ప్రభాకర్ శాస్త్రి కోన అప్పారావు ఎలికే వరప్రసాద్ ఎర్రమల సుబ్బారావు డి రామకృష్ణ వీరపండు లింగాల సత్యనారాయణ మొక్కపాటి నాగ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి సిపిఎం నిరసన : కొవ్వొత్తుల ప్రదర్శన




**యలమంచిలి,మేమేజర్ న్యూస్:** ఇటీవల కాశ్మీర్లో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ మండలంలోని చించినాడ జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు ఈసందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ. ఉగ్రవాదులు జరిపిన మారణకాండ అత్యంత హేయమైన చర్యని ఇటువంటి దాడులను కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, సరిపల్లి జయప్రభ, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముమ్మిడి వరపు ఆంజనేయులు,శెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్,మల్లుల కోటి, మల్లుల రామకృష్ణ, కోరం వెంకటేశ్వర రావు, జిల్లెల్ల ప్రశాంతి, ముస్కూడి జయశ్రీ, శెట్టిమి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్ ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ




ఏలూరు,మేజర్ న్యూస్ : అమ్మానాన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో భారతీయుల మీద కాశ్మీర్ పెహల్గాంలో జరిగిన పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులను ఖండిస్తూ కూటమి ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వం బలపరుస్తూ భారతీయుల ఐక్యమత్యం చాటుతూ కొవ్వొత్తుల నిరసన శాంతి ర్యాలీ జరిగింది. వైఎంహెచ్ ఏ హాల్ సెంటర్ నుండి మెయిన్ బజార్ బిర్లాభం సెంటర్ పెద్ద వంతెన మీదుగా బడేటి చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం అను ,ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# జనసేనలో చేరిన వైసీపీ నాయకులు,కార్యకర్తలు

**- 6వ డివిజన్ నుండి 50 మందికి పైగా రాక**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక 6వ డివిజన్ మాదేపల్లి రోడ్డు, ఇందిరా కాలనీ కీ చెందిన సుమారు 50 మంది కీ పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో ఏలూరు జనసేన పార్టీలోకి చేరారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి సుమారు 50 మంది కీ పైగా వైసీపీ కీ చెందిన నాయకులు, కార్యకర్తలు,వీర మహిళలు వైసీపీనీ వీడి జనసేన పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, పవన్ కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరుతున్న వారిని మనస్ఫూర్తిగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్ధమవ్వాలని కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచించారు. ఏలూరు నియోజకవర్గంలో ఉన్న 50 డివిజన్లోని నాయకత్వం బలపడే విధంగా పనిచేయాలని, స్థానికంగా ఉన్న సమస్యల మీదే దృష్టి సారించాలని, సమస్యలు పరిష్కారానికి పనిచేసే దిశగా ఉండాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఏలూరు పార్లమెంట్లోని ఏలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ చాలా బలంగా ఉందని, కూటమి శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) జనసేన పార్టీకి సానుకూల పరిస్థితుల్లో, అవసరమైన మౌలిక సదుపాయాలు అన్నిటిని కూడా సమకూరుస్తున్నారని,ఈ సందర్భంగా జనసేన పార్టీ తరపున ఏలూరు శాసనసభ్యులకు మీడియా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, 44 వ డివిజన్ కార్పొరేటర్ పొలిమేర దాసు, ప్రధాన కార్యదర్శులు సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, పల్లి విజయ్, కార్యదర్శులు కందుకూరి ఈశ్వరరావు, ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇంచార్జీ జనసేన రవి, వీర మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు మందలించారనే కారణంతో యువకుడి ఆత్మహత్య




**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** టి.నర్సాపురం మండలం తిరుపతిపాడు గ్రామానికి చెందిన నులకని పూర్ణ సాయి పవన్ (22) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్నట్లు అది నచ్చని తల్లిదండ్రులు ట్రాక్టర్ డ్రైవింగ్ చేయొద్దని, మన పొలం మన వ్యవసాయం చేసుకుందాం అని మందలించినట్లు సమాచారం.

దీనితో మనస్థాపంతో పూర్ణ సాయి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని చనిపోయినట్లు,తల్లి ఇచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్నున్నారు.

## మృతి చెందిన వృద్ధుడి వివరాలు తెలపాలి



ఏలూరు,మేజర్ న్యూస్ : ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఒక వృద్ధుడు మృతి చెం దాడు. ఏలూరు తూర్పు వీధి సచివాలయం పరిధిలో పెన్షన్ పొందుతున్న పాము అప్పారావుగా ఒకటో పట్టణ పోలీసులు ఇతన్ని గుర్తించారు. కానీ ఇతని రక్త బంధువులు ఎవరైనా ఉన్నారా లేదా ఇతను ఎక్కడ నివాసం ఉంటున్నాడు అన్న వివరాలు పోలీసులకు తెలియరాలేదు. దీంతో వారి రక్త బంధువులకు మృతదేహాన్ని అప్పగించేందుకు ఆదివారం రాత్రి ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వివరాలు తెలిసినవారు ఏలూరు ఒకటో పట్టణ సీఐ 9440796604 ఎస్ఐ 9440796605 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# కాశ్మీర్ ఉగ్ర దాడిని ఖండించండి : సిపిఎం




**పెంటపాడు,మేజర్న్యూస్ :** పత్తిపాడు గ్రామం గాంధీరెడ్డి గొడౌమ్స్ వద్ద లంకలపల్లి అప్పారావు అధ్యక్షతన కాశ్మీర్ పహల్గామా లోని బైరాలస్ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిగిన దాడికి నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కాశ్మీర్లోని బెలారస్ ప్రాంతం చాలా సుందరమైనదని దీనిని రెండో స్విజర్లాండ్గా పిలుస్తారని తెలిపారు.

చాలామంది కుటుంబాలతో సహా అక్కడ కి వచ్చి కాలక్షేపనం చేసే పరిస్థితి ఉంటుందని అటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. ఉగ్రవాదులు చొరబడి కులాల మతాలు అడిగి భార్య ముందు భర్తను భర్త ముందు భార్యను పిల్లల ముందు తల్లిదండ్రులను చంపటం ఇది చాలా కిరాతకమైన దాడి అని తెలిపారు.

ఇటువంటి సంఘటన పునరావతం కాకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా వడ్డాది సన్నాసిరావు. జక్కంపూడి. బంగారురాజు.జక్కంపూడి పెంటారావు. గెల్లపాపారావు.కొమ్మూరి గోపి. మజ్జి సురేష్. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వం రాకతో మారిన మత్స్యకారుల దశ

### - కొల్లేరు ప్రాంతంలో పలువురు మత్స్యకారులకు లబ్ధి : మంత్రి పార్థసారథి



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థికసాయంను రెట్టింపు చేసి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర నిర్మాణ సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు.ఈపథకం ద్వారా రాష్ట్రంలోనే 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిం దన్నారు.మత్స్యకార గ్రామాలకు గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయని,వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయమన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10వేలనుంచి రూ.20వేలకు పెంచామన్నారు.

ప్రజలం దరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టినా,ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా శతమా నం అందలేదన్నారు.2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిం దని,2014-2019మధ్య మత్స్యకారుల సంక్షేమంకోసం రూ.788 కోట్లు తమ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని, అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్‌బా క్సులు అదనంగా ఇచ్చామన్నారు.

రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకా రులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామ ని,వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కొల్లేరు మండలాల్లోని కేవలం చేపల వేట పై జీవనం సాగించే ఎంతో మంది మత్స్యకారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు.

**-చేపల ఎగుమతుల్లో ఏపీ టాప్..**

రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయని,చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉందన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోందన్నారు. ఏపీ నుంచే 32 శాతం మత్స్య సంపద ఎగుమతులు జరుగుతున్నాయని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధిలభిస్తోందన్నారు .చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలున్నా య్యని ,వీటి ద్వారా ప్రోటీన్ అధికంగా శరీరానికి అందుతుందని,ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు వినియోగం పెరగాలని మంత్రి పార్థసారథి చెప్పారు.

# నేటి నుండి గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు



**పెదపాడు,మేజర్ న్యూస్ :** పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఈ నెల 28వతేదీ నుండి జూన్ నెల 6 వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహణ జరుగుతుందని,ఈ శిబిరంలో విద్యార్థిని,విద్యార్థులకు బాలసాహిత్యం ,కథలు వినడం,కథలు చెప్పడం, కథలు చదివించడం,పుస్తక సమీక్ష ,చిత్రలేఖనం, చదరంగం ,క్యారమ్స్ ,క్విజ్, జీకే మొదలగు అంశాలను బాలలు నేర్చుకోవచ్చును అని వివరించారు. తల్లిదండ్రులు మీ పిల్లలను తప్పనిసరిగా గ్రంథాలయమునకు పంపించి మంచి విజ్ఞానవంతులుగా తయారు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన బిసి గురుకుల ప్రవేశ పరీక్షలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి తెలిపారు.ఏలూరు బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో 80 సీట్ల కుగాను 147 నుంచి విద్యార్థులు అప్లై చెయ్యగా 116 మంచి పరీక్షకు హాజరయ్యారన్నారు.వీరి వెంట జిల్లా సమన్వ యకర్త, ఏలూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి వున్నారు.

# కార్మిక రంగానికి రెడ్డి అప్పల నాయుడు సేవలు అమూల్యం

### - ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సత్కారం




**నూజివీడు,మేజర్‌న్యూస్ :** కార్మిక రంగానికి రెడ్డి అప్పలనాయుడు చేస్తున్న సేవలు అమూల్యమైనదని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా కోశాధికారి నాగరాజు పేర్కొన్నారు. నూజివీడు పట్టణంలోని ఎమ్.ఆర్. అప్పారావు కాలనీలో ఐఎఫ్‌టియుకార్మిక నాయకులు ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మిక సంఘాల నాయకులు,ఆర్టీసీ జోనల్ చైర్మన్‌రెడ్డి అప్పలనాయుడు, నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణి బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ తాను ఈ స్థాయికి రావడానికి ఐఎఫ్టియు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిద న్నారు. సమాజంలో శ్రామిక వర్గాలు పడుతున్న బాధలు, పేదవర్గాలు అనుభవిస్తున్న కష్టాలు అనేక రకాల పరిస్థితులను చూసి దాదాపు 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిఈస్థాయికి చేరుకున్నన్నారు. ఐఎఫ్‌టియు అనేక మంది నాయకులను తయారు చేసిందని,అందులో తాను ఒకరని పేర్కొన్నారు. ఏమి ఆశించకుండా కార్మిక వర్గం కోసం పోరాడేది ఐఎఫ్‌టియు అన్నారు. తనను అక్రమంగా 3 నెలలు జైలు పాలు చేసినప్పుడు కూడా వెనుక నిలబడింది కార్మిక వర్గమే అని,అప్పుడు పోలీస్ స్టేషన్ ని సైతం దిగ్బంధనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు ప్రెసిడెంట్ దేవుడు, ఐఎఫ్టియు సెక్రటరీ బోను సాయి, జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ మెంబర్ పాశం నాగబాబు,స్థానిక నూజివీడు జనసేన నాయకులు బొబ్బిలి శ్రీకాంత్, తోట వెంకట్రావు,పగడాల జగన్మోహన్రావు,గొల్లపల్లి శ్రీకాంత్, గొల్లపల్లి గిరి,పొన్నూరు నాగబాబు,స్థానిక టిడిపినాయకురాలుషేక్ నజీమా, ఐఎఫ్‌టియు అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కోకో రైతుల ఛలో గుంటూరు

### - కంపెనీ మోసాలు అరికట్టి రైతులకు న్యాయం చేయాలి



**పెదవేగి,మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటించాలని కోరుతూ ఈనెల 28న సోమవారం కోకో రైతుల చలో గుంటూరు 'ధర్నా' కార్యక్రమం చేపట్టామని, కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు.ఆదివారం విజయరాయి,గాంధీనగర్‌లోని కోకో తోటలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 28న ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంట లోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కోకో రైతుల చలో గుంటూరు "ధర్నా"లో కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య,రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ,రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు,నాయకులు నాగరాజు శ్రీనివాస రాజు, కె.రామిరెడ్డి, పి.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నీటి తొట్ల నిర్మాణం - మూగజీవాల పాలిట వరం

### - ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో శరవేగంగా ఏర్పాటు



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** పశువుల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నీటితొట్ల నిర్మాణం చేపట్టింది. పోలవరం నియోజకవర్గంలో శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో నీటితొట్ల నిర్మాణం శరవేగంగా జరగడంతో వేసవి తాపాల నుంచి రక్షించుకుంటూ పశువులు దాహార్తిని తీర్చుకుంటూ సేద తీరుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో నీటితొట్ల నిర్మాణాలు చేపట్టి పశువులకు ఎంతో మేలు చేశారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే అన్ని నియోజకవర్గాల కంటే పోలవరం నియోజకవర్గంలో చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో నీటితొట్ల నిర్మాణాలు శరవేగంగా జరిగాయి. జీలుగుమిల్లిలో పశువుల ఆసుపత్రి వద్ద నిర్మించిన నీటి తొట్టిలో కోతులు స్నానమాడుతూ సేద తీరడం ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కుండీ నిండా నీరు నింపడంతో వాటికి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. గ్రామంలో ఉన్న కోతులన్నీ దాహార్తిని తీర్చుకుంటూ వేసవి తాపాన్ని తగ్గించుకోవడం చూస్తుంటే నీటి తొట్ల నిర్మాణం ఎన్ని సత్ఫలితాలు ఇస్తుందో ఇట్టే అర్థమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రజలకు పశువులకు ఉపయోగపడేదిగా ఉంటుందని అంటున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటితొట్ల నిర్మాణాలను శరవేగంగా నిర్మించేందుకు కృషిచేసిన శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి





**- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

**పెదవేగి,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అనునిత్యం కష్టపడి జీవించే మత్స్యకారుల జీవితాల్లో సంక్షేమం సాకారం అవుతుందని, దేశ మత్స్య సంపదలో 29శాతం మన రాష్ట్రానిదే అని, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మత్స్యకారులకు అండగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్యేని పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు అధికారులు ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల కోసం మత్స్య కారుల సేవలో పథకం ద్వారా వేట నిషేధ సమయంలో రూ. 20వేల సాయం విడుదల చేయటం ద్వారా రాష్ట్రంలోని 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా ఇటు కొల్లేరుతో పాటు రాష్ట్రంలోని మత్స్యకార గ్రామాలు టీడీపీకి అండగా నిలబడ్డాయి అని, సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి మత్స్య కారుల సేవలో పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించటం జరిగిందని అన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ : జిల్లా కలెక్టర్



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం నుండి మండల, డివిజనల్ ,మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులుఈవిషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు,డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్,మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీక రించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు : ఎస్ ఐ జయ బాబు



**టి.నర్సాపురం, మేజర్ న్యూస్:** మైనర్లు మోటార్ వెహికల్ డ్రైవింగ్ చేస్తుండగా వారిని గుర్తించి ఎస్ఐ జయ బాబు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివారం ఆయన హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు.

మైనర్ లు వాహనాలు నడిపినా, వాహనాలు వారికి ఇచ్చినా వారిపైన కూడా కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.ద్విచక్ర వాహనాలు నడిపేవారు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం పనికిరాదని, లైసెన్స్ ఉండాలని,తదితర ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్. ఐ సూచించారు.

## సోషలిస్టు రాజ్యమే లక్ష్యంగా సిపిఐ కృషి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్ నందు, మేడే సందర్భంగా ఆదివారం నిర్వహించిన జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ రెండో రోజు గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆర్ శ్రీనివాస్ డాంగే అధ్యక్షత జరిగింది. ఈ సభలో ఆ పార్టీ నాయకులు ఆర్. శ్రీనివాస్ డాంగే, పి. కిషోర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తవుతుందని అన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వందేళ్ళ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ 100 ఏళ్ల వార్షికోత్సవం,ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా ఏలూరులో క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దానిలో భాగంగా గత రెండు రోజులుగా సిపిఐ ఆఫీసులో జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్ జరిగిందని తెలిపారు.భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర పోరాటంలో విరోచితంగా పాల్గొన్నదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి అప్పలరాజు,నాయకులు జగన్నాథ రావు,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భజంత్రీ శ్రీనివాస్, టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా కృష్ణకుమారి, ఆర్బిటర్ సూర్యనారాయణ, కోచ్ లక్ష్మణరావు, సహాయకులు లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు సిపిఐ వందేళ్ళ ఉత్సవాలు,మేడే సందర్భంగా నిర్వహించిన జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్లో విజేతలు వీరేజిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్లో చాంపియన్ గా కెఎస్ఎస్. కార్తీక నిలిచారని,తరువాత టాప్ 5లో కె ఓంకార్, ఎం నాగరాజు, జి అఖిల సాయి పుండరీనాథ్, ఎం.కుశాంక్ శ్రీ విశ్వ తదితరులు విజేతలు అయ్యారని,వివిధ ఏజ్ గ్రూపుల్లో మరో 20 మంది గెలుపొందారని,5 గురికి ప్రత్యేక కన్సిలేషన్ బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు.

## మృతి చెందిన వృద్ధురాలి వివరాలు తెలపాలి



**ఏలూరు,మేజర్న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు ఆదివారం మృతి చెందింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈనెల 14వ తేదీన ఆమెను అంబులెన్సులో ఏలూరు తీసుకుని వచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. కానీ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. వృద్ధురాలి పేరు లక్ష్మి గా తెలుస్తుంది. వివరాలు తెలిసినవారు ఒకటో పట్టణ సిఐ 9440796604 ఎస్ఐ 9440796605 నంబర్లకు సంప్రదించాలని వారు సూచించారు.

# యోజీ జ్ఞాపకార్థం పాఠశాలకు 50 కిలోల బియ్యం పంపిణీ





**- విద్యార్థులకు సహపంక్తి భోజనాలు,నిత్యావసరాలు వితరణ**

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన కమ్మ వెంకటరత్నారావు విమలమ్మ దంపతుల ప్రథమ కుమార్తె మక్కిన రమేష్ సతీమణి యోజి (యామిని) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం మణుగూరు మండలం సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస (పూర్వ బాలవెలుగు) పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.పాఠశాలకు 50 కిలోల బియ్యాన్ని,నిత్యావసరాలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన సింగరేణి సేవా సమితి సభ్యులు యస్‌డి నాసర్ పాషా మాట్లాడుతూ యోజీ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు,భర్త రమేష్ సహకారంతో ప్రతి సంవత్సరం బాల వెలుగు పాఠశాలలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తోపాటు అక్షర యోజి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవా సభ్యురాలు జమీలా బేగం,సామాజిక సేవా కార్యకర్త అంగోత్ మంగీలాల్ శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి,కిరణ్ కుమార్, ఉపాధ్యాయిని సుహాసిని దేవి సిబ్బంది సుజాత, రాధా తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసుల తనిఖీలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రైల్వే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆర్పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా రిజర్వేషన్ కౌంటర్లు బుకింగ్ ఆఫీస్లు వెయిటింగ్ హాల్స్ ప్లాట్ ఫామ్ లలో ఈ తనిఖీలు కొనసాగాయి. రైల్వే డిఎస్పి జి రత్నరాజు విజయవాడ లైన్ సిఐ దుర్గారావు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి రామానాయుడు శ్రమదానం





**– అరుంధతి పేటలో డా.అంబేద్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో పాల్గొన్న 'నిమ్మల'**

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి రామానాయుడు శ్రమదానంచేశారు.పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతి పేటలో ఆదివారం జరిగిన విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో కార్మికులతో కలిసి ఆయన స్వయంగా పాల్గొన్నారు. కంకర ను పారతో గిన్నెలో వేసుకొని నెత్తి మీద పెట్టుకొని మిల్లర్ లో పోశారు. ఇసుక, సిమెంట్ ను పోశారు. స్లాబ్ పైకిఎక్కి కాంక్రీట్ పనులు చేశారు. మండుటెండను సైతంలెక్కచేయకుండా చెమటలు కారుతున్నా పట్టించు కోలేదు. ఆయన పనుల్లో చురుగ్గా పాల్గొనడంచూసి ప్రతి ఒక్కరూ శభాష్ రామానాయుడు అంటూ కొనియాడారు. అక్కడే ఆయన టిఫిన్ చేశారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ స్లాబ్ నిర్మాణ పనులను గత అంబేద్కర్ జయంతిరోజున ప్రారంభించి ఆనాడు శ్రమదాన పనులు చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిగా ఆర్య పేటలో అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల స్లాబ్‌నిర్మాణ పనుల్లో శ్రమదానం చేశారు. ఆరోజే నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రమదాన పనులు అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ బాబు జగజ్జీవన్ రామ్‌వంటి మహనీయుల విగ్రహాలన్నిటికీ ఎండ వానకు తడవకుండా రక్షణగా స్లాబ్ నిర్మాణాలు చేపడతానని. చెప్పారు. ఆయా స్లాబ్ పనుల్లో అవకాశం ఉన్నంతవరకు శ్రమదానం చేస్తానని మంత్రి రామానాయుడు చెప్పారు. అంబేద్ అంబేద్కర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని, తన తండ్రి ధర్మారావు పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలన్నిటికీ స్లాబ్ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తానని చెప్పారు. మహనీయుల విగ్రహాల స్థాపన, వాటి పరిరక్షణ పనుల్లో స్వయంగా పాల్గొంటే ఎంతో ఆనందం, సంతృప్తిని ఇస్తుందన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు సవరపు వెంకటేశ్వరరావు,సవరపునాని బాబు, కొండేటి గాంధీ, లక్కవరపు శ్రీను, వసంతాడ జాను,గుమ్మాపు రాజేష్, సవరపు లాజర్ కొండేటి నరసింహారావు, కొండేటి చిన్న వెంకయ్య, కామంచి కిషోర్, భరతల కిషోర్,గుమ్మాపు సిసింద్రీ, గుమ్మాపు నవీన్, వీరమల్లు శ్రీను,వాసా మల్లికార్జున రావు, అందేశ్వరరావు,అదే కోట నాగయ్య, గరగపర్రు రాజు, మోతుకూరి ప్రసన్నకుమార్, కవిటిక బుద్దేశ్వర రావు కోడి విజయభాస్కర్ పెనుమత్స శ్రీనివాసరాజు తొంట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా జాతీయ రహదారి విస్తరణ పనులు

**– శాసనసభ్యులు,ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ డా.కామినేని**




**కైకలూరు, మేజర్ న్యూస్ :** శాసనసభ్యులు, ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ డా.కామినేని శ్రీనివాస్ స్థానిక కైకలూరులో ట్రావెల్స్ బంగ్లా నందు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుచున్నవి, ఈ నేపథ్యంలో కైకలూరు, మండవల్లి మండలాల్లో టిప్పర్లతో మట్టి తరలింపు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. మండవల్లి నుంచి ఆలపాడు శివారు వరకు 9 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పనులకు సంబంధించి పదివేల టిప్పర్లు మట్టి అవసరమైన నేపథ్యంలో ట్రాక్టర్లతో తరలింపు కష్టతరమైందని తెలిపారు.ఈ యాడాది లోపు రహదారి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అందుకు అందరూ సహకరించాలని కోరారు. మిగతా మండలాల్లో ఎక్కడైనా నియోజకవర్గ సరిహద్దులు జిల్లా హద్దులు టిప్పర్లు దాటినా వెంటనే వాటిపై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాడినాడ బాబు, కొల్లి వరప్రసాద్( బాబి) త్రినాధ రాజు,ఎన్ డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయం

**– మత్స్యకారులకు పలు అభివృద్ధి పథకాలు : ట్రైకార్ చైర్మన్ బొరగం**



**పోలవరం,మేజర్ న్యూస్ :** వేట నిషేధ సమయంలో రూ.20వేల సాయం విడుదల చేసి 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూర్చి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేసి చూపించారని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇంటి వద్ద జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం తెలుగుదేశం ధ్యేయం అని, సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచింది.

ప్రజలందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని మరోసారి రుజువు చేశారని తెలిపారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టారని,కాని ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా? 2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టింది. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇచ్చామని శ్రీనివాసులు అన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని,మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామని, వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని పోలవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ,రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పేర్కొన్నారు.

## ద్వారక తిరుమలేశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



**ద్వారకాతి రుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న క్షేత్రం ఆదివారం ఉదయం గోవింద నామస్మరణలతో మార్మోగింది.రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు,పదవ తరగతి ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థులను మొక్కుబడులు తీర్చుకున్నారు.శ్రీవారి కళాతోరణంలో చిన్నారుల కోలాటం నృత్యం భకులను ఆకట్టుకుంది. ఆలయ విభాగాలు అన్ని భక్తులతో కిటకిటలాడాయి. కేశఖండనశాల క్యూ లైన్లు,అనివేటి మండపం,తూర్పు రాజగోపాల ప్రాంతం,జంట గోపురాలు ప్రసాదం టికెట్ కౌంటర్లు భక్తులతో నిండాయి. ఆలయ సిబ్బంది వేసవి కావడంతో క్యూలైన్లో మంచినీటి సరఫరాను చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు పర్యవేక్షణ చేశారు.

## ఎమ్మెల్యే ముప్పిడిని పరామర్శించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** ఇటీవల కాలంలో అనారోగ్య కారణంతో ఆపరేషన్ చేయించుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,రాష్ట్రబీసీసెల్ అధ్యక్షులు పోరాకుల బుజ్జి ఆదివారం ఉదయం ఆయుష్ హాస్పిటల్‌లో ఆయాని పరామర్శించారు. ఈక్రమంలో అల్లా పండు రాచప్రోలు బాలరాజు ఉన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : సర్పంచ్ రామకృష్ణ



**పెంటపాడు,మేజర్ న్యూస్ :** పెంటపాడు మండలం మౌంజిపాడు లో తాగునీటి కొరత లేకుండా చూసే బాధ్యత తీసుకుంటానని గ్రామ సర్పంచ్ ఆలపాటి రామకృష్ణ తెలిపారు. గత 10 రోజుల నుండి రాత్రింబవళ్లు కష్టపడి జట్లపాలెం మిడ్ లేవుల్ కాలువ నుండి పైప్లైన్ ద్వారా త్రాగునీరు తీసుకురావడానికి రాత్రింబవళ్లు కష్టపడి లీకేజీలను గుర్తించి వాటి స్థానంలో జెసిబి తో తవ్వించి లీకేజ్‌లకు మరమ్మతులు చేసి తాగునీరు తీసుకువచ్చామని రామకృష్ణ తెలిపారు. ప్రజలు నాకిచ్చిన బాధ్యత వమ్ము చేయకుండా ప్రజల దాహార్తి తీర్చడమే నా బాధ్యత అని ఆయన అన్నారు. గత పది రోజుల నుండి జెసిబి ని వెంటబెట్టుకుని ఎక్కడ లీకేజీ ఉంటే అక్కడ తవ్వించి కూలీలను వెంటబెట్టుకొని రాత్రనక, పగలనక అలుపెరుగ నీ పోరాటం చేసి మంచినీటి దాహార్తినీ తీర్చిన సర్పంచ్ రామకృష్ణను పలువురు అభినందించారు. తాను పదవి చేపట్టిన నాటినుండి గ్రామానికి కావలసిన మౌలిక సదుపాయాలు ఎస్సీ కాలనీలో సీసీ డ్రైన్స్ పూర్తిగా నిర్మించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. పంచాయతీలో మోటార్ సమస్య ఉందని స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస దృష్టికి తీసుకు వెళ్ళగా వెంటనే మోటర్ కొనుగోలుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని రామకృష్ణ ఈ సందర్భంగా హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. పంచాయతీ సిబ్బంది సత్యనారాయణ కష్టపడిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.